# దైవం మానుష రూపేణ

**చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెం**
**పెక్కిన తేనెకన్న అతి రుచ్యము నోటను పల్క పల్కగా**
**మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించును కాననిత్యమున్**
**చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు కృష్ణనామమున్**

***ప్రేమస్వరూపులారా!*** ప్రాచీనకాలమునుండి కృష్ణతత్త్వము ఆబాల గోపాలమును ఆకర్షిస్తూవచ్చింది. కృష్ణుడు పుట్టినది మొదలుకొని తన ఆటపాటలచేత అందరికీ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కల్గిస్తూ, అందరినీ తన్మయులను గావిస్తూ వచ్చాడు. ఒక పర్యాయం బలరామ కృష్ణులు గోపబాలకులతో కలిసి యమునాతీరములో గోవులను మేపడానికి తీసుకువెళ్ళారు. అక్కడ గోపబాలురు కృష్ణునితో ఆడుతూ, పాడుతూ ఆనందములో మునిగి గోవుల సంగతి పూర్తిగా మరచిపోయారు. కొంతసేపు తరువాత చల్ది భుజించి విశ్రాంతి తీసుకుంటూ ఉండగా నలుదిశలనుండి తీవ్రమైన వేడిగాడ్పులు వీచసాగాయి. ఎక్కడ చూసినా మంటలు! కళ్ళు తెరచి చూడడానికి కూడా వీలుకానంతటి ప్రచండమైన అగ్నిజ్వాలలు! ఆ వేడితీవ్రత క్షణక్షణమునకూ అధికమౌతూవచ్చింది. గోవులు నలుదిక్కుల పరుగెత్త సాగాయి. వాటిని అదుపులో పెట్టలేక గోపబాలకులు, “కృష్ణా! ఈ మంటలను నీవు తప్ప అన్యులు ఆర్పలేరు. ఈ విపత్తునుండి నీవే మమ్మల్ని కాపాడాలి”, అని ప్రార్థించారు. కృష్ణుడు పక్కున నవ్వి “గోపబాలకులారా! ఇంతకాలమునుండి నాతో ఆడుతూ, పాడుతూ నా దివ్యత్వాన్ని ఇంతమాత్రమైనా గుర్తించుకోలేకపోయారా? పలుమార్లు కంసుడు పంపిన రాక్షసులను నేను సంహరించి మిమ్మల్ని కాపాడుతూవచ్చాను కదా! ఇప్పుడు మీ గోవులు ఎక్కడికి వెళ్ళినవో, ఎలా ఉన్నవో అనే దిగులు మీకెందుకు?

అడిగిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ
　　పెరటివృక్షమునకై ప్రీతి యేల?
అడిగిన పాలిచ్చు కామధేనువుయుండ
　　ధనమిచ్చి ఆవును కొనగనేల?
మండెడు కాంతితో మేరుపర్వతముండ
　　వెండి బంగారుకై వెతుకనేల?

సర్వశక్తిమయుడైన కృష్ణుడు మీ వెంటనే, జంటనే ఉండగా ఈ చిన్న ఆపదకు ఎందుకింత భయపడుతున్నారు? ఒక్కతూరి కన్నులు మూసుకొని నన్ను స్మరించండి”, అన్నాడు. కృష్ణుని ఆజ్ఞను తు.చ.తప్పక పాటించేవారు గోపాలురు. తక్షణమే వాళ్ళు కన్నులు మూసుకొని “కృష్ణా! కృష్ణా!” అని స్మరిస్తూ వచ్చారు. మరుక్షణం కృష్ణుడు, “గోపబాలకులారా! కళ్ళుతెరచి మీ గోవులెక్కడున్నాయో చూసుకోండి”, అన్నాడు. వాళ్ళు కళ్ళు తెరచి చూసే సరికి అగ్ని అంతర్ధానమైంది. గోవులన్నీ తిరిగివచ్చాయి. ఆ గోపబాలకుల ఆనందానికి అవధులు లేవు. కృష్ణుడు చేసిన

ఈ అద్భుత లీలనుగురించి తమ తల్లిదండ్రులకు చెప్పాలని వాళ్ళు త్వరత్వరగా ఇళ్ళకు బయలుదేరారు.

**ఉల్ఫ్ మెస్సింగ్ ఉదంతము**

కేవలం భారతదేశమునందు మాత్రమే కాదు; నాస్తికదేశమైన రష్యాయందుకూడా ఇలాంటి చిత్రవిచిత్రమైన సంఘటనలు జరిగాయి. ఉల్ఫ్ మెస్సింగ్ అనే వ్యక్తి 1899 సెప్టెంబరు 10వ తేదీన పోలాండ్‌లో జన్మించాడు. పుట్టినప్పటినుండి అతడు దివ్య తేజస్సుతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూవచ్చాడు. చిన్నతనమునుండియే చేతులు త్రిప్పడం, ఎవరితోనో మాట్లాడుతున్నట్లు కనిపించడం, తనలో తాను మాట్లాడుకోవడం, నవ్వుకోవడం... ఈరీతిగా చిత్ర విచిత్రంగా ప్రవర్తిస్తూ వచ్చాడు. అతని వింతప్రవర్తన తల్లిదండ్రులకు ఆందోళన కల్గించింది. "ఈ పిల్లవానికేమైనా పిచ్చిపట్టిందా? ఎవరితో మాట్లాడుతున్నాడు? ఎందుకు నవ్వుతున్నాడు?" అని వాళ్లు పరిపరి విధాలుగా చింతిస్తూ వచ్చారు. ఈవిధంగా కొంతకాలం గడిచింది.

ఒకనాడు తెల్లనిగౌను ధరించిన ఒక ఆజానుబాహుడు ఆ ఇంటి ముందుకు వచ్చి నిల్చున్నాడు. బాలుడైన మెస్సింగ్‌ను దగ్గరకు పిలిచి, "నాయనా! నీవు పిచ్చివాడవనుకొని నీ తల్లిదండ్రులు నిన్ను పిచ్చాసుపత్రిలోనో లేక, ఏదైనా ఒక స్కూల్లోనో చేర్చడానికి సిద్ధంగా ఉన్నారు. నీవు ఎక్కడికీ వెళ్ళవద్దు. నీ 'పిచ్చి' ఏమిటో తెలిసినవారికే అర్థమౌతుందిగాని, పిచ్చివారికేమి తెలుస్తుంది? నీది ఆధ్యాత్మికపిచ్చి. ఈ పిచ్చి అందరికీ పడితే దేశమే బాగుపడుతుంది. నీకు లౌకికమైన, భౌతికమైన విద్యలు అంటవు. కాబట్టి, నీవు లౌకికవిద్యలు నేర్పే స్కూల్లో చేరవద్దు. ఆధ్యాత్మిక విద్యను నేర్చుకో. ఈవిషయాన్ని చెప్పేందుకే నేను వచ్చాను", అన్నాడు. అప్పుడా పిల్లవాడు, "తాతా! మీరెక్కడినుండి వచ్చారు?" అని అడిగాడు. "అదంతా తరువాత చెబుతాను. ఇప్పుడు నేను ఎక్కడికి వెళతానో అక్కడినుండే వచ్చాను. నా మాటలను మరువవద్దు. ఆధ్యాత్మికవిద్యను మాత్రమే అభ్యసించు. ఎవరితోనూ సంబంధం పెట్టుకోవద్దు. ఇదిగో, నేను వెళుతున్నాను", అని చెప్పి అంతర్ధానమయ్యాడు. మెస్సింగ్‌కు ఆశ్చర్యం కల్గింది. "ఈయన ఎక్కడినుండి వచ్చాడు? ఎక్కడికి వెళ్ళాడు? నేనుకూడా ఎక్కడినుండి వచ్చానో తిరిగి అక్కడికే వెళతానా?" అని తనలో తాను విచారణ చేస్తూవచ్చాడు.

**మెస్సింగ్ కమలాపురంలో 'రాజు'ను దర్శించడం**

కొంతకాలం గడిచింది. తల్లిదండ్రులు మెస్సింగ్‌ను ఎక్కడికీ పంపకుండా ఇంట్లోనే ఉంచి చదువు చెప్పించడానికి ప్రయత్నించారు. అది 1909 ఫిబ్రవరి 9వతేది. "ఇక్కడ లౌకికమైన విద్యలు నేర్పుతున్నారు. కాని, ఆ మహనీయుడు నన్ను ఆధ్యాత్మికవిద్యను నేర్చుకొమ్మని చెప్పాడు. కాబట్టి, నేనింక ఈ ఇంట్లో ఉండకూడదు. ఎక్కడికైనా వెళ్ళాలి", అని నిశ్చయించు కున్నాడు మెస్సింగ్. ఇంట్లో వెతికితే ఒక అల్మారాలో కొంత డబ్బు కనిపించింది. ఆ డబ్బును తీసుకొని బయల్దేరాడు. ఎక్కడికి వెళుతున్నాడో, ఏమి చేస్తున్నాడో తనకే తెలియదు. క్రమక్రమేణ ప్రపంచమంతా చుట్టాడు. 'ఎక్కడ నీ టిక్కెట్టు?' అని అతనిని అడిగినవారు లేరు. అతనిచెంతకే ఎవ్వరూ రాలేదు. ఈవిధంగా అనేక సంవత్సరాలు తిరిగాడు. తరువాత ఇండియాలో ప్రవేశించాడు. కడపనుండి అనంతపురం వెళ్ళే రైల్లో కూర్చున్నాడు. అది కమలాపురం స్టేషనుదగ్గర ఆగింది.

అప్పుడు నేను కమలాపురంలో చదువుతున్నాను. ఏమి చదువు? పిచ్చిచదువు! క్లాసులో రమేశ్, సురేశ్ అనే ఇద్దరు పిల్లలు నాకిరువైపుల కూర్చునేవారు. రమేశ్ తండ్రి శిరస్థదారు. వాళ్ళు గొప్ప శ్రీమంతులు. నేను, ఆ పిల్లలు కలిసి ప్రతిరోజు సాయంకాలం రైల్వేస్టేషనువైపుకి వెళ్ళేవారము. అక్కడ కూర్చుని అనేక ఆధ్యాత్మిక విషయాలను ముచ్చటించుకునేవారము. అప్పుడు రైళ్ళు ఎక్కువ లేవు; దినానికి ఒకటో, రెండో అటువైపుగా ప్రయాణం చేసేవి. మేము వెళ్ళి స్టేషన్లో కూర్చున్నాము. వాళ్ళేవో ప్రశ్నలు అడుగుతున్నారు, నేను జవాబులు

చెబుతున్నాను. ఇంతలో రైలు కిటికీ నుండి నన్ను చూశాడు మెస్సింగ్. రైలు కదులుతూ ఉండగానే తలుపు తెరిచి దూకాడు, క్రిందపడిపోయాడు. రమేశ్, సురేశ్‌లు, "అయ్యో పాపం! కాలు విరిగిందేమో", అన్నారు. "ఏమీ కాలేదు. అతను ఎవరికోసం వస్తున్నాడు? నాకోసమే వస్తున్నాడు. కాబట్టి, ఏ ప్రమాదమూ జరగదు. మీరు ఊరక ఉండండి", అన్నాను.

అతని చేతిలో కనీసం ఒక బ్యాగుకూడా లేదు. నన్ను చూస్తూ ఆనంద బాష్పాలు రాల్చుతున్నాడు. ఆ దృశ్యాన్ని రమేశ్, సురేశ్‌లు చూశారు. ఆ రోజుల్లో తెల్లదొరలు వచ్చి తమను బలవంతంగా తీసుకువెళ్ళి మిలట్రీలో చేరుస్తారని పిల్లలు భయపడేవారు. అందుచేత, మెస్సింగ్ మాదగ్గరికి వస్తూంటే రమేశ్ ఇంటికి పరుగెత్తాడు. తండ్రితో, "నాన్నా! ఎవరో ఒక తెల్లదొర మన రాజును ఎత్తుకుపోవడానికి వచ్చాడు. నీవు తక్షణమే జీపు తీసుకొని రావాలి", అని చెప్పాడు. ఆయన వెంటనే వచ్చి నన్ను ఎత్తుకొని జీపులో కూర్చోపెట్టుకొని, "రాజూ! నిన్ను తరువాత మీ ఇంటికి చేరుస్తాను గాని, ముందు మా ఇంటికి వెళదాం", అని నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. జీపు వెనుకనే మెస్సింగ్‌కూడా వచ్చాడు. చాలాసేపు వాళ్ళింటిముందరే కూర్చున్నాడు. నేను కనిపించినప్పుడల్లా నవ్వడం, పిలవడం, నన్ను చూసి ఏదేదో చెప్పడం జరిగింది. కాని, బ్రిటీషు వారితో మనము మాట్లాడకూడదని ఆ ఇంటివారు తలుపులు మూసేశారు. అప్పుడు శేషమరాజు ఆ ఊరిలోనే టీచరుగా పని చేసేవాడు. "ఒక తెల్లదొర రాజును తీసుకుపోవాలని మా ఇంటి వెలుపల కాచుకొని ఉన్నాడు. రాజు మాఇంట్లోనే ఉన్నాడు, తరువాత నేను మీఇంటివద్ద క్షేమంగా దిగబెడతాను", అని రమేశ్ తండ్రి ఒక ప్యూనుద్వారా శేషమరాజుకు కబురు పంపాడు. ఆ తరువాత మెస్సింగ్ ట్రైనెక్కి ఎటో వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు ఆ ఇంటి తలుపుపై ఒక పెన్సిల్‌తో, "దైవస్వరూపుడైన పిల్లవానిని మీ ఇంట్లో పెట్టుకొని సేవలు చేస్తున్న మీరెంతో భాగ్యవంతులు. నాకింతే ప్రాప్తమున్నది. థ్యాంక్స్", అని వ్రాశాడు. అక్కడినుండి తాను రష్యాకు వెళ్ళిపోయాడు.

**"స్వామి సాక్షాత్తు భగవంతుడు"**

అనేక సంవత్సరాల తరువాత మెస్సింగ్ మళ్ళీ ఇండియాకు వచ్చాడు. కమలాపురం వెళ్ళి నాగురించి వాకబు చేశాడు. అప్పటికి నాపేరు రాజు కాదు, మారిపోయింది. "అతనిప్పుడు గురువుగా మారినాడు. అతని పేరు సత్యసాయిబాబా. ఇప్పుడు పుట్టపర్తిలోనో, బెంగుళూరులోనో ఉంటాడు", అని అక్కడివారు చెప్పారు. అతను బెంగుళూరులోని ఆశ్రమానికి వచ్చాడు. అక్కడ అనేకమంది భక్తులు కాచుకొని ఉన్నారు. ఎందుకని అడిగితే, "సత్యసాయిబాబా దర్శనం కోసం", అని చెప్పారు. తానుకూడా అక్కడే నిల్చున్నాడు. నేను వచ్చి ఆ జనం మధ్యలో తిరుగుతూ ఉంటే చూసి, "నేను ఆనాడు చూసింది ఇతనినే. ఆ తేజస్సు ఇక్కడా ప్రకాశిస్తూనే ఉంది", అనుకున్నాడు. ఆ తరువాత బృందావనం కాలేజి ప్రిన్సిపాల్ నరేంద్రను కలుసుకున్నాడు. నరేంద్ర చాలా గొప్పవాడు, పిల్లలకు చక్కగా బోధించే వాడు. అతని తండ్రి పేరు దామోదరరావు. ఆయన జడ్జిగా పనిచేసేవాడు. అతని మామగారి పేరు సుందర్‌రావు. ఆయన పేరుగాంచిన వైద్యుడు. ఆసమయంలో వాళ్ళిద్దరూ అక్కడే ఉన్నారు. ఇతను వాళ్ళవద్దకు వెళ్ళి "స్వామి సాక్షాత్తు భగవంతుడు. కాని, తన నిజరూపంతో మీకు కనిపించడం లేదు. సామాన్యమైన మానవ రూపాన్ని మాత్రమే మీరు చూస్తున్నారు. స్వామియొక్క Aura చూస్తే మీకే తెలుస్తుంది", అని చెప్పాడు.

మరుసటిరోజు భక్తులు నగరసంకీర్తన చేసి వచ్చిన తరువాత వారికి నేను బాల్కనీనుండి దర్శనం ఇస్తున్న సమయంలో అతనికి నా దేహము చుట్టూ గొప్ప తేజస్సు కనిపించింది. ఆ తరువాత నావద్దకు వచ్చినప్పుడు, "My dear, You are my everything. I am Your instrument. You are my every-thing..." (మీరే నా సర్వస్వం... నేను మీ పనిముట్టును) అంటూ ఆనందబాష్పాలు రాల్చాడు. ఈవిషయం

ఇంతవరకు నేనెవ్వరికీ చెప్పలేదు. అతనికి చూపవలసినవన్నీ చూపాను, చెప్పవలసినవన్నీ చెప్పాను. "దైవం మానుషరూపేణ". "భగవంతుడు మానవ రూపంలోనే అవతరిస్తాడు, సామాన్య మానవునిగానే గోచరిస్తాడు", అని చెప్పాను. అతను రష్యాకు తిరిగి వెళ్ళిపోయాడు. కొన్ని దినముల తరువాత నరేంద్రకు ఒక లెటర్ వచ్చింది. "భగవంతుని విద్యాసంస్థలో టీచరుగా పనిచేస్తున్న నీవెంతటి అదృష్టవంతుడవు! స్వామివిషయాలు తెలియజేస్తూ అప్పుడప్పుడు నాకు ఉత్తరాలు వ్రాయగలవు", అని వ్రాశాడు.

ఒకనాడు నేను, నరేంద్ర కూర్చొని మాట్లాడుకుంటున్నాము. ఆ సమయంలో ఠక్కున వచ్చాడు మెస్సింగ్. ఎలా వచ్చాడు? టిక్కెట్టు లేదు. వచ్చాడు, నన్ను చూశాడు. తరువాత మాయమైపోయాడు. ఇది అందరికీ గోచరమయ్యేది కాదు. చెబితే అందరికీ అర్థమయ్యేది కాదు. దైవత్వము చాలా గోప్యమైనది.

**కృష్ణుడు చేసిన మరొక అద్భుతలీల**

ఒకనాడు గోపబాలకులందరూ కలసి యమునా తీరంలో చెట్లమీద ఒక కొమ్మమీదినుండి మరో కొమ్మమీదికి ఎగురుతూ ఆడుకుంటున్నారు. ఆ సమయంలో భరద్వాజుడు మరొక మహర్షితో కలిసి అక్కడికి వచ్చి, "నాయనలారా! ఇక్కడ స్నానం చేయడానికి ఏది అనువైన ప్రదేశము? ఎక్కువగా లోతులేని ప్రదేశమేది?" అని అడిగారు. చెట్టుపైనుండి కృష్ణుడు క్రిందికి దూకాడు. తక్షణమే బలరాముడుకూడా దూకాడు. కృష్ణుడు సాక్షాత్తు పరమాత్ముడేనని గుర్తించి భరద్వాజుడు చేతులు జోడించి, "కృష్ణా! మేము స్నానం చేయడానికి ఎక్కువగా లోతులేని ప్రదేశమేదో చూపిస్తావా?" అని అడిగాడు. కృష్ణుడు, "నేను చూపిస్తాను, రండి", అంటూ తాను నదిలోకి దూకి చూపించాడు. "ఇది స్నానం చేయడానికి అనువైన ప్రదేశము. మీరు స్నానం చేసి వచ్చేలోగా మీకు భోజనం సిద్ధం చేస్తాము", అని చెప్పాడు. కృష్ణుడు తనవెంట ఏమీ తీసుకు రాలేదు. కాని, ఎక్కడినుండియో ఒక మూట ప్రత్యక్షమైంది. మహర్షులు స్నానం చేసి వచ్చిన తరువాత ఆ మూటను విప్పాడు. అది పాలతో వండిన అన్నము, ఘుమఘుమ లాడుతున్నది. చుట్టూ పిల్లలున్నారు కదా, కోతులు! "కృష్ణా! ఇది నీకు ఎక్కడినుండి వచ్చింది?" అని పదేపదే అడుగుతూ వచ్చారు. "మహర్షుల ఎదుట అధికప్రసంగం చేయకూడదు", అని చెప్పి కృష్ణుడు వాళ్ళ నోళ్ళు మూయించాడు. మహర్షులు సంధ్యావందనమాచరించి ఆ అన్నమును భుజించారు. "కృష్ణా! దీనిని ఎవరు వండారు?" అని అడిగారు. "మా అమ్మ యశోద", అని కృష్ణుడు జవాబివ్వగా, "ఇంత రుచికరమైన అన్నమును మేమెన్నడూ భుజించలేదు", అని ఎంతో ఆనందించారు.

**దైవలీలలు చిత్రవిచిత్రమైనవి**

కృష్ణుడు చేస్తున్న ఈ చిత్రవిచిత్రమైన లీలలను బ్రహ్మ కనిపెడుతూ వచ్చాడు. అతనికి ఆశ్చర్యం కల్గింది. ఒకనాడు గోపబాలకులు యథాప్రకారం గోవులను తీసుకొని అడవికి వెళ్ళారు. అక్కడ వాళ్ళు కృష్ణబలరాములతో కలిసి ఆడుతూ, పాడుతూ ఆనందములో మైమరచి యుండగా, కృష్ణుని మహిమను చూడాలనే తలంపుతో బ్రహ్మ ఆ గోవులను, గోపబాలకులను అదృశ్యం గావించాడు. చుట్టుప్రక్కల ఒక్క గోవుగాని, ఒక్క గోపబాలకుడుగాని కనిపించలేదు. అది బ్రహ్మ చేసిన పని అని కనిపెట్టి కృష్ణుడు తన దివ్యసంకల్పంతో వెంటనే ఆయా గోపబాలకులను, గోవులను సృష్టించాడు. ముమ్మూర్తుల అవే ఆకారములు, అవే స్వభావములు. ఆ మాయాగోపబాలకులు తమతమ గోవులను తీసుకొని ఇళ్ళకు తిరిగి వెళ్ళారు. ప్రేమ, ప్రవర్తనలకు సంబంధించి కుమారుల విషయంలో తల్లిదండ్రులకు భేదమేమాత్రము కనిపించలేదు. అందుచేత, వాళ్ళు తమ పుత్రులే అనుకున్నారు. ప్రతి రోజూ తెల్లవారుతూనే గోప బాలకులు తమ గోవులను మేతకు తీసుకువెళ్ళడం, సాయంత్రానికి తిరిగి రావడం... ఈరీతిగా వ్యవహారమంతయు యథాప్రకారం జరిగిపోతున్నది. ఇట్లొక

సంవత్సరం గడిచింది. దైవలీలలు ఎంత విచిత్రమైనవి! దీనిని పురస్కరించుకొనియే భాగవతం చెబుతోంది:

**చిత్రంబులు త్రైలోక్య ప**
**విత్రంబులు భవలతాలవిత్రంబులు స**
**న్మిత్రంబులు మునిజనవన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్**

బ్రహ్మ తన ఓటమిని అంగీకరించి, తాను దాచిపెట్టిన గోప బాలకులను, గోవులను తెచ్చి ఇచ్చాడు. తక్షణమే కృష్ణుడు సృష్టించిన గోవులు, గోపబాలకులు అంతర్ధానమయ్యారు. ఈవిధంగా, కృష్ణుడు బాల్యము నుండియే అనేక మహత్తరమైన లీలలను ప్రదర్శిస్తూవచ్చాడు.

ఈ అవతారంలో జరిగిన ఒక చిన్న విచిత్రమును మీకు చెబుతున్నాను. ఇంతవరకు ఎవ్వరికీ చెప్పలేదు. ఈ ప్రశాంతి మందిరం కట్టిన తరువాత నేను పైఅంతస్తులో కుడిప్రక్కన ఉన్న రూములో భోజనం చేసేవాడిని. ఆ సమయంలో గృహం అమ్మాయి (మాతృశ్రీ ఈశ్వరమ్మ) అక్కడకు వచ్చి, "స్వామీ! మీరు సరిగా తిండి తినక బక్కపడిపోతున్నారు. బాగా తినండి", అని బలవంతం చేసేది. "నేను ఎవరితోనైనా యుద్ధం చేయాలా? లావుగా తయారుకావాలా? ఛీ, వద్దు. నాకిష్టం లేదు", అనేవాడిని. ఒకనాడొకరు నన్ను వాళ్ళ ఇంటికి రావలసిందిగా ఆహ్వానించారు. ఎందుకోసం? నాకు విషం పెట్టి చంపాలని. దినదినానికీ అభివృద్ధి అవుతున్న నా పేరు ప్రఖ్యాతులను చూసి వారికి అసూయ కల్గింది. అక్కడినుండి తిరిగి వచ్చేటప్పటికి నా దేహం నీలంగా మారిపోయి నోట్లోనుండి నురుగు రావడం ప్రారంభమైంది. ఈశ్వరమ్మతో "నీవు చేయి త్రిప్పు", అని చెప్పాను. ఆమె చేయి త్రిప్పితే విభూతి వచ్చింది. "స్వామి చేయి త్రిప్పితే విభూతి వస్తుందిగాని, నేను త్రిప్పితే విభూతి ఎలా వచ్చింది?" అని ఆమె ఆశ్చర్య పోయింది. ఆ కొద్దిసేపు నేనే ఆమెకు ఆ శక్తిని ఇచ్చాను. ఆమె ఆ విభూతిని నీళ్ళలో కలిపి నాకు త్రాపింది. తక్షణమే విషప్రభావం హరించుకుపోయింది.

### కరణం సుబ్బమ్మ భక్తివిశ్వాసాలు

నేను పూర్వం పాతమందిరంలో ఉన్నప్పుడు ప్రతి దినము చిత్రావతికి వెళ్ళేవారము. అక్కడికి గ్రామంలోని పిల్లలందరూ వచ్చేవారు. ఒకరు పెన్సిల్ కావాలనేవారు, ఒకరు పెన్ను కావా లనేవారు. వాళ్ళు చిన్నపిల్లలు కాబట్టి అలాంటి కోరికలు కోరేవారు. "ఒక ఇసుకకుప్ప చేసి అందులో మీకు కావలసినవి వెతుక్కోండి", అని చెప్పేవాడిని. వారికేది కావాలంటే అది లభించేది. ఒకనాడు చిత్రావతినుండి పాతమందిరానికి తిరిగి వస్తున్నాము. స్వామి వచ్చే లోపల మందిరానికి వెళ్ళి హారతి ఇవ్వడానికి ఏర్పాట్లు చేయాలని సుశీలమ్మ, ఆమె సోదరి కుమారమ్మ (ఈమె 'అన్యథా శరణం నాస్తి' అనే పుస్తకం వ్రాసింది) ముందు పరుగెత్తారు. అప్పుడు నేను వాళ్ళను ఆపవలసిందిగా సుబ్బమ్మకు సైగ చేశాను. "నీవు ముందు వెళ్ళు", అని చెప్పాను. అప్పుడామె వాళ్ళను ఆపి, "మీరిక్కడే ఉండండి, నేను వెళతాను", అంది. "ఈ సుబ్బమ్మ వితంతువు కదా! ఈమె హారతి ఎట్లా ఇస్తుంది?" అని వాళ్ళు అనుకున్నారు. సుబ్బమ్మ వెళ్ళేసరికి ద్వారముదగ్గర ఒక పెద్ద సర్పముంది. సుబ్బమ్మ అన్నీ చాలా జాగ్రత్తగా చూసుకునేది. ఆ సర్పాన్ని చూసి, "సాయి నాగేశ్వరా! సాయినాగేశ్వరా!"అని గట్టిగా పిలిచింది. ఈలోపల అందరూ పరుగెత్తుకొని వెళ్ళారు. ప్రతి జీవిలోను భగవంతు డున్నాడని స్వామి చెబుతారు కదా! కాబట్టి, ఈ పామును కొట్టకూడదు, చంపకూడదు, అని భావించి ధైర్యం చేసి ఆ పామును చేతితో పట్టుకుంది. వెంటనే అది ఆమె చేయికి చుట్టుకుపోయింది. ఈలోపల నేను వెళ్ళాను. "ఏమి సుబ్బమ్మా! పాముతో ఆడుకుంటున్నావా?" అని తమాషా చేశాను. అప్పుడామె "స్వామీ! మీరు నన్ను ముందుగా పంపింది వాళ్ళను కాపాడటంకోసమే కదా!"

అన్నది. ఈరీతిగా, సుబ్బమ్మ అనేక లీలలను చూసింది. ఆమె చాలా పుణ్యాత్మురాలు, మహా అదృష్టవంతురాలు. మొదటినుండి నాకు సేవ చేస్తూ వచ్చింది. నాకే కాదు, నాకోసం వచ్చిన భక్తులందరికీ వంటలు వండిపెట్టేది. బంధువులందరూ ఆమెకు విరోధులైనారు. "నాకెవ్వరూ అక్కర్లేదు. బాబా ఒక్కరుంటే చాలు నాకు. బాబా ఏది చెబితే అది చేస్తాను", అని చెప్పేది. ఆమెకు స్వామిపట్ల అంతటి దృఢ విశ్వాసముండేది.

ఒకనాడు నేను, "సుబ్బమ్మా! నీకు నీ భర్తను చూడాలని ఆశగా ఉందా?" అని అడిగాను. నేను అప్పుడప్పుడు ఆమెతో ఈరీతిగా జోక్ చేసేవాడిని. అప్పటికి ఆమె భర్త మరణించాడు. "నాకు అలాంటి ఆశలేమీ లేవు స్వామీ! పోయిన మనిషితో నాకేమి పనుంది? ఆయనకు ప్రాప్తంలేక పోయినారు. నాకు ప్రాప్తముంది కాబట్టి, నేను మిమ్మల్ని సేవిస్తున్నాను", అన్నది. "నీకు ఒకతూరి చూడాలని ఉంటే చూడు, ఆ ఋణముకూడా తీరిపోతుంది", అని పలికి, "కొంచెం అట్లా బయటికిపో", అన్నాను. బయట ఒక మునగ చెట్టు ఉండేది. ఆమె భర్త నారాయణరావు ఆ చెట్టుక్రింద కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడు! ఆ దృశ్యాన్ని సుబ్బమ్మ ప్రత్యక్షంగా చూసింది. చూసి సంతోషించడమే కాకుండా అతనిని తిట్టిందికూడా. "చచ్చిన తరువాత కూడా నీవీ దురభ్యాసములను వదలిపెట్టలేదే! నీ ముఖం చూడను", అని చెప్పి లోపలికి వచ్చేసింది. ఆయనకు కమలమ్మ అని రెండవ భార్య ఉండేది. కమలమ్మ ఇప్పుడుకూడా మన మందిరంలో ఉంటున్నది. "కమలమ్మా! ఒకతూరి నీవుకూడా పోయి చూడు", అని చెప్పాను. "స్వామీ! మేము మీదగ్గరున్నాము. ఇంక మాకేమీ అక్కర్లేదు", అన్నది. "ఒక్కతూరి పోయి చూసిరా", అని మళ్ళీ చెప్పాను. ఆమె వెళ్ళి చూసేటప్పటికి ఆయన వేడివేడి కాఫీ త్రాగుతున్నాడు! ఆయన బ్రతికి ఉండినప్పుడు ఏమి చేసేవాడో అవే చర్యలు చేస్తూ వీరికి కనిపించాడు. ఈవిధంగా, కృష్ణుడుకూడా ఎప్పుడెప్పుడో జరిగిన సంఘటనలను మళ్ళీ చూపించడం జరిగింది.

**"పాట పాడుమా కృష్ణా!'**

కృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తినప్పుడు అందరూ ఉత్సవం చేసుకున్నారు. గోపికలు వరలక్ష్మీ వ్రతము ఆచరించారు. వారిలో రాధ చాలా గొప్ప భక్తురాలు. కాని, ఆమెను అనేకమంది హింసిస్తూ వచ్చారు. ఈనాడేకాదు, ఆనాడుకూడా నాస్తికులుండేవారు. ఆస్తికులు, నాస్తికులు, యాస్తిక నాస్తికులు అన్ని యుగాల్లోను ఉన్నారు. కృష్ణుడు కనిపిస్తే రాధ అతనివెంట పరుగెత్తుకొని పోతుందేమోనని భావించి బంధువులు ఆమెను ఇంట్లో పెట్టి తలుపులు వేశారు (దీనిని ఒక డ్రామాగా వ్రాసి పిల్లలకు నేర్పించాను) ఆమె లోపలినుండి ఏడుస్తూ కృష్ణుణ్ణి ప్రార్థిస్తుంది. ఆమె ప్రార్థనను ఆలకించి కృష్ణుడు వెళ్ళి అక్కడున్నవారితో, "మీకు భక్తి లేకపోయినా ఫరవాలేదుగాని, భక్తులను ఈరీతిగా హింసించడం మహాపాపం", అంటాడు. రాధను విడిపించి తనవెంట తీసుకువెళతాడు. అప్పుడామె కృష్ణుని పాదాలపై పడి, "స్వామీ! నాకెలాంటి కోరికలూ లేవు. ఒక్కతూరి నీ మురళీగానమును వినిపించు, చాలు", అని ప్రార్థించింది.

*"పాటపాడుమా కృష్ణా!*
*పలుకు తేనెలొలుకునటుల*
*మాటలాడుమా ముకుంద మనసు తీరగా*
*వేదసారమంత తీసి నాదబ్రహ్మముగను మార్చి*
*వేణువందు తిరుగబోసి*
*గానరూపముగను మార్చి*
*పాట పాడుమా కృష్ణా...."*

అప్పుడు కృష్ణుడు తన మధుర మనోహరమైన వేణుగానమును వినిపించాడు. ఆ గానమును వింటూ రాధ ప్రాణం విడిచింది. ఆనాటినుండి కృష్ణుడు మళ్ళీ మురళిని ముట్టలేదు. కృష్ణుడు లీలామానుషవిగ్రహుడు. అతని లీలలు అనంతమైనవి, అగాథమైనవి, అప్రమేయమైనవి. కృష్ణ తత్త్వము పరిపూర్ణ ప్రేమతత్త్వము.

**మగవారికంటే ఆడవారికే దైవభక్తి మెండు**

ద్వాపరయుగమునందు కృష్ణుని దైవత్వమును స్త్రీలే ఎక్కువగా విశ్వసిస్తూవచ్చారు. ఒకపర్యాయం కొందరు బ్రాహ్మణులు అరణ్యంలో గాయత్రీ యజ్ఞం చేస్తున్నారు. అప్పుడు కృష్ణబలరాములు గోప బాలకులతో, "మాకు బాగా ఆకలిగా ఉన్నది. ఇక్కడికి సమీపంలో ఒకచోట యజ్ఞం జరుగుతోంది. మీరు వెళ్లి, ఋత్విక్కులనడిగి మాకొరకు భోజనం తీసుకురండి", అని చెప్పి పంపించారు. ఆ గోపబాలకులు ఋత్విక్కుల వద్దకు వెళ్ళి, "కృష్ణబలరాములు కాలి నడకన అరణ్యానికి వచ్చారు. వారికి బాగా ఆకలిగా ఉందట. కొంచెం అన్నం పెడతారా?" అని అడిగారు. వాళ్ళు, "ఇదేమైనా చావడి అనుకున్నారా? సత్రమనుకున్నారా?యజ్ఞం పూర్తి అయి, భగవంతునికి నైవేద్యం పెట్టి మేము భుజించిన తరువాత మిగిలింది మీకు పెడతాం", అన్నారు. గోపబాలకులు కృష్ణునికి ఈవిషయాన్ని విన్నవించగా కృష్ణుడు, "యజ్ఞశాల వెనుకవైపున వారి పత్నులు వంటలు వండుతున్నారు. మీరు అక్కడికి వెళ్ళి అడగండి", అన్నాడు. గోపబాలకులు వెళ్ళి, "అమ్మలారా! కృష్ణునికి చాలా ఆకలిగా ఉందట. కొంచెం భోజనం పెడతారా?" అని అడిగారు. "ఇంతకంటే భాగ్య మున్నదా!" అని వాళ్ళు ఎంతో సంతోషించి, తాము వండిన పదార్థాలను మూటకట్టుకొని తామే స్వయంగా కృష్ణునివద్దకు తీసుకు వెళ్ళారు. కొందరు మాత్రం భయపడ్డారు, భగవంతునికి నైవేద్యం పెట్టకుండా, బ్రాహ్మణులు భుజించకుండా గొల్లవాడైన కృష్ణునికి పెడితే తమ భర్తలు దండిస్తారేమోనని. మిగిలిన స్త్రీలు వాళ్ళ మాటలను పట్టించుకోలేదు. "గోపాలుడే మా దేవుడు", అని భావించి తాము తీసుకువెళ్ళిన వంటకాలను బలరామకృష్ణులకు వడ్డించారు. వాళ్ళు తిరిగి వెళ్ళేసరికి భర్తలు వాళ్ళకోసం ఎదురు చూస్తున్నారు. "ఇంతసేపు ఎటు వెళ్ళారు? మాకు భోజనం పెట్టకుండా ముందు ఆ గొల్లవానికి పెట్టడానికి వెళ్ళారా?" అని చీవాట్లు పెట్టారు. తరువాత ధ్యానంలో కూర్చున్నప్పుడు తమ పొరపాటును గుర్తించి పశ్చాత్తాప పడ్డారు. మళ్ళీ స్నానం చేసి వచ్చి, కృష్ణుడు భుజించగా మిగిలిన ప్రసాదమును తమకు పెట్టవలసిందిగా తమ పత్నులను కోరారు.

ఏ అవతారమునందైనా దైవత్వమును మొట్టమొదట గుర్తించినవారు స్త్రీలే. అసలు మగవారిని దైవము దగ్గరికి లాక్కొనిపోయేవారు స్త్రీలే. వారి భక్తిప్రపత్తులవల్లనే పురుషులకు అంతో ఇంతో భక్తి కల్గుతున్నది. కనుకనే, స్త్రీని భక్తితోను, పురుషుణ్ణి జ్ఞానముతోను పోల్చారు. మగవారు దర్బారు హాలుదాటి లోపలికి వెళ్ళడానికి వీల్లేదుగాని, స్త్రీలు అంతఃపురంలోకూడా ప్రవేశించవచ్చు. అదేరీతిగా, జ్ఞానము భగవంతునిదగ్గరకు చేర్చుతుందిగాని, భక్తి మాత్రం నేరుగా భగవంతుని హృదయంలో ప్రవేశపెడుతుంది. కనుకనే, మన ప్రాచీనులు భక్తికి గొప్ప విలువనిచ్చారు. భక్తిప్రపత్తులు ఆడవారికి ఉన్నట్లుగా మగవారికి లేవు. సకల సద్గుణములూ వారియందే ఉన్నాయి. కాబట్టి, ఆడవారిని చులకన చేయవద్దు.

పుట్టపర్తిలో భగవచ్చింతన కరణం సుబ్బమ్మ ఇంట్లోనే ప్రారంభమైంది. ఆ రోజుల్లోనే నాదగ్గరికి పెద్దపెద్ద ఆఫీసర్లు వచ్చేవారు. ఎవరైనా పోలీసుడ్రస్సుతో కనిపిస్తే గృహం అమ్మాయి (ఈశ్వరమ్మ) చాలా భయపడేది. మెల్లగా సుబ్బమ్మ ఇంటికివచ్చి, "సుబ్బమ్మా! పోలీసువాళ్ళు స్వామికేమైనా ఇబ్బంది కల్గిస్తారేమో! వాళ్ళను స్వామిదగ్గరకు రానివ్వకండి", అని చెప్పేది. "వాళ్ళుకూడా భక్తులే కదా! స్వామికోసం అందరూ వస్తారు. నీవు భయపడ నక్కర్లేదు", అని సుబ్బమ్మ ధైర్యం చెప్పేది. ఒక పర్యాయం ఐ.జి.పి. రంగనాయకులు నన్ను మద్రాసుకు

తీసుకు వెళ్ళాలని వచ్చాడు. గృహం అమ్మాయి ఇంక ఒకటే ఏడుపు! నేను మద్రాసుకు వెళ్ళడం అదే తొలిసారి. అప్పుడు పుట్టపర్తి ప్రజల దృష్టిలో మద్రాసు అంటే ఎక్కడో దూరంగా ఉన్న పరాయి దేశము! "స్వామిని ఏదో దూరదేశానికి తీసుకొని పోతున్నారట", అని విన్నది. "అడ్డుపడతాను, స్వామిని పోనివ్వను", అని నిశ్చయించు కుంది. "స్వామీ! మీరు పోకూడదు, పోకూడదు", అని ఏడ్చింది. ఆమెకు స్వామిపట్ల ఉన్న ప్రేమ అలాంటిది.

**మాతృమూర్తికి స్వామి చేసిన వాగ్దానం**

ఒకరోజున సాకమ్మ అనే భక్తురాలు, "స్వామీ! ఈ పల్లెకు వచ్చి పోవాలంటే మాకు చాలా కష్టంగా ఉంది. ఇక్కడికి కార్లు రావడానికి వీల్లేదు. ఎడ్లబండిమీద రావడానికికూడా చాలా కష్టమౌతోంది. కాబట్టి, మీరు బెంగుళూరుకి వచ్చేయండి. అక్కడ మీకు గొప్ప భవనం కట్టిస్తాము", అంది. "అక్కడ గొప్ప భవనాలు నాకు అక్కర్లేదు. ఇక్కడున్న చిన్నరూము చాలు", అని నేను చెప్పాను. నేను చెప్పినా ఆమె వినేది కాదు. అప్పుడు ఈశ్వరమ్మ, "స్వామీ! మొక్క ఎక్కడ పుట్టిందో అక్కడే దానికి పాదుకట్టి, ఎరువు వేసి, నీరు పోసి పెంచితే అది గొప్ప వృక్షంగా తయారౌతుంది. దాన్ని కొంతకాలం ఒకచోట ఉంచి తరువాత పెరికివేసి ఇంకొకచోట పాతిపెట్టడం... ఈరీతిగా చేస్తూ ఉంటే అది ఎలా అభివృద్ధికి రాగలదు? కనుక, మీరు పుట్టిన గ్రామంలోనే ఉండండి", అని కోరింది. అప్పుడు నేను పుట్టపర్తిని వదలిపెట్టనని ఆమెకు మాట ఇచ్చాను. "నేనిక్కడే ఉంటూ భక్తులవద్దకు వెళ్ళి వస్తుంటాను", అని చెప్పాను. తరువాత ఇక్కడ ఈ మందిరనిర్మాణం జరగడానికి ఆమెయేకారణం.

సర్వుల క్షేమాన్ని మనం కోరుకోవాలి. ఎందుకంటే, సర్వులయందు భగవంతుడే ఉన్నాడు. భగవంతుడు సర్వస్వరూపుడు. ద్వాపరయుగంలో కృష్ణుడు ఇట్టి మహత్త్వాన్ని నిరూపించాడు. కృష్ణుడు చేసిన ఒక చిన్న తమాషా చెబుతున్నాను. కంసుడు ప్రజలను అనేకవిధాలుగా హింసిస్తూ ఉంటే కృష్ణుడు వానిని సంహరించాడు. కంసునికి ఇద్దరు భార్యలు. వారి తండ్రి కృష్ణునిపైకి దండెత్తి వచ్చాడు. వ్రేపల్లెవాసులు కృష్ణునివద్దకు వెళ్ళి, "ఎన్ని దినాలు మేమీ అవస్థలు పడాలి?" అని వాపోయారు. అప్పుడు కృష్ణుడు, "భయపడకండి. నా శక్తిసామర్థ్యములను మీరు అర్థం చేసుకోండి. రాత్రికి మీరందరూ ఈ వ్రేపల్లెలో పడుకుంటే తెల్లవారేసరికి ఎక్కడుంటారో చూసుకోండి", అని చెప్పాడు. ఆ రాత్రికి వ్రేపల్లెలో పడుకున్నవారు తెల్లవారి లేచేసరికి ద్వారకలో ఉన్నారు! వ్రేపల్లె ఎక్కడ, ద్వారక ఎక్కడ! వాటి మధ్యదూరం వెయ్యిమైళ్ళు. ఈరీతిగా, కృష్ణుడనేక అద్భుతాలను చేస్తూవచ్చాడు. భగవంతుడు ఏమైనా చేయగలడు. కనుక, మీరు సందేహాలకు చోటివ్వకండి. సందేహాలే మిమ్మల్ని ముంచివేస్తున్నాయి. ప్రగాఢమైన, పరిపూర్ణమైన విశ్వాసంతో దైవత్వాన్ని అనుసరించండి.

***(2002 ఆగష్టు 31వ తేదీ సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)***